# తీరిన సమస్య

"నిద్ర పడతోసుకొస్తూంది నాకు, భోజనానికి లేచేదేమైనా వుందా?" చిటికెవేస్తూ, ఆవలింత ఆపుకుంటూ భర్తను చూచి అడిగింది కనకమ్మ.

"ఇదిగో-ఎంతలో! వడ్డించు కాళ్ళు కడుక్కొని వచ్చేస్తా" అన్నాడు శివయ్య.

కనకమ్మ ఆకువాల్చి వడ్డించేసింది. తుండు గుడ్డతో కాళ్ళు తుడుచుకుంటూ శివయ్య వచ్చాడు. పీటమీద కూర్చుంటూనే, "అయితే రాఘవు ఇవాళ అన్నం తిన్నాడా?" అన్నాడు.

"మీరు భోంచేద్దురూ. వాడి అన్నం అజ అడుగుతున్నారు. అయినా తిట్టడం, కొట్టడం మీవంతు, పిలవటం, పెట్టటం నా వంతూనా?" అన్నది కనకమ్మ.

రాఘవ లారోజు అన్నం తిన్నట్లేఅర్థమైంది శివయ్యకు. లేకపోతే భార్యమాట ధోరణి ఇంకోలాగ వుండేది!

భోజనం పూర్తి కావచ్చింది. పెరుగు వడ్డించింది కనకమ్మ. "పెద్ద గేదె ఎన్నాళ్ళు కీసుతుందీ? ఇదివరకుమంచి దూడనే పెట్టింది" అన్నాడు శివయ్య.

"అన్నం దగ్గరే వస్తాయి మీకు దూడ కబుర్లూ, దుప్పి కబుర్లూ, ఇవతల ఒక చెంపన నిద్రొచ్చి నే ఛస్తుంటే" అన్నది కనకమ్మ. శివయ్య భోజనం ముగించి లేచాడు.

ఆ క్రిందటిరోజు శివయ్యకు రాఘవులిమీద చెడ్డకోపం వచ్చి చెడామడా తిట్టేశాడు. తెల్లారగట్లలేచి వెళ్ళి పెద్దపాలేరును పిల్చుకు రమ్మన్నా" నంటాడు శివయ్య. "నేను వినలేదండయ్యగారూ" అన్నాడు రాఘవులు. "నువ్వెక్కడ వింటావురా. ఒళ్లు పొగరేసి పోతే! నే చూస్తున్నాగా-నువ్వు మారిపోయావురా! యీ వూరి నీళ్లు వంట బట్టినయ్—ఇవాల్టి కివాళ ఎంత నాశనం, ఎంతనాశనం? ఇప్పుడేం అఘోరిస్తావ్" ఓపిగ్గా పావుగంట నిలేసితిట్టాడు శివయ్య. రాఘవులు నిజంగానే వినివుండక పోవచ్చు. ఎవరిని ఎవరు తిడుతున్నా కాళ్ళు చేతులు వణికిపోయే మనిషి కనకమ్మ. రాఘవుల్ని అంటే తన పెద్దకొడుకు యీడువాణ్ణి నిలబెట్టి తిట్టున్న భర్త మీద కోపం వచ్చిందామెకు. రాఘవులు చెప్పిందే నమ్మింది కనకమ్మ. "ఈయ నొక మతి మరుపు మనిషి, చెప్పలేదేమో అసలు-లేకపోతే తెల్లవారగట్ల లేవడానికి వాడు బద్ధకించడు" అనుకుంది. "అయినా ముసలితనం వస్తుంటే కోపం ఎక్కువవుతోం దీయనకు. ఈ రోజుల్లో పాలేర్లను తిడితే పడతారా? సరిపడకపోతే పొమ్మనాలిగాని! యీ మధ్య చిన్నమ్మాయి పెదబావగారు వాళ్ళపాలేర్నెవరినో మోటుగా తిడితే, వాడు ఆయనన్నంతామాటా తిప్పి మళ్ళీ అన్నాడట. రోజులు మారుతున్నా, ఈ మనిషి మారరు" అనుకుంది భర్తను గురించి.

తిట్లు తిని రుసరుసలాడుతూవస్తున్న రాఘవులుకు, తాడు వూడతీసి కొనిపోయి అరటిపిలకను ఆప్యాయంగా ఆరగిస్తున్న కోడెదూడ కంట బడ్డది. కోపం పట్టలేక కర్ర విసిరాడు దూడమీదకు. ఏ పట్టున తగిలిందో చూస్తుండగానే ఆ దూడ క్రిందబడి తన్నుకుంటూ కళ్ళు తేలేసింది. దొడ్లోకి వచ్చిన కనకమ్మ, రాఘవులు కర్ర విసరడం, కోడెదూడ కళ్ళు తేలెయ్యడం అంతా చూసింది. "అయ్యో, అదేమిటిరా" అంటూనే వెళ్ళి తనే దూడచెవులు మూసి పట్టుకున్నది. రాఘవులకు "అమ్మగారి"

ముఖం చూడ్డానికి సిగ్గేసింది. ఏదో ఆ దూడకు భూమ్మీద యున్న గడ్డి పరకలున్నాయి కనుకకాని, అసలది లేవాల్సిన పనికాదు.

కనకమ్మకు రాఘవులు చేసిన పనికి వాడిమీద కోపం వచ్చినా వెళ్ళగ్రక్కలేదు. తప్పు తన భర్తదే ననుకుంది. అయినా కోడెదూడ క్రింద పడితే తన కడుపులో త్రిప్పినట్లయింది. తన భర్త కోపం తను ఎట్లాగూ తగ్గించలేదు. వీడు - ఈ రాఘవులు, వాడికొచ్చిన కోపం కోడెదూడలమీద చూపిస్తే "ఏమిటీ వుపాయం?" అనుకుంది.

రాఘవులు ఆరోజంతా కనకమ్మను తప్పించుకునే తిరిగాడు. కనకమ్మ ఎన్నోసార్లు ఎవరెవరితోనో "రాఘవులొచ్చిన ఈ రెండేళ్ళ నించి మా ఆవులకన్నీ కోడెదూడలే గేదెదూడ లదివరకు ఒక్కటీ దక్కేవిగావు. వీ డొచ్చినాక నిక్షేపంలా వున్నాయి అన్నీ!" అని మురిసి పోతూ చెప్పడం విన్నాడు వాడు.

ఆ వూళ్ళో మునసబుగారి తర్వాత శివయ్యే మోతుబరి. మహా కోపిష్టి! అయితే ఆయనిచ్చేంత జీతాలు ఆ చుట్టుప్రక్కల ఎవ్వరూ ఇవ్వరు. కోపమొచ్చి పాలేర్లను కొట్టినా, తిట్టినా, ఆ తర్వాత మహా బాధపడిపోయేవాడు. చివాట్లు పెట్టిన్నాడు,-చీకటయ్యాక, అవతల మనిషి ముఖం సరిగా కనిపించని మసకచీకట్లోకి మనిషిని కేకేసి "నువ్వు సినిమా కెళ్ళి ఎన్నిరోజులయిందిరా" అనేవాడు. తెలివిగల నౌకరయితే, వెళ్ళి వారమే అయినా "నెలయేపోయింది" అనేవాడు, అది అబద్ధమని తెలిసినా శివయ్య "అయితే అడగఖర్లా నీ సినిమాల సంగతికూడ నేనే అజ పుచ్చుకోవాలన్నమాట—వూఁ-ఇంద అన్నం తిని పో" అని అర్ధ రూపాయి కాసు గిరవాటేశాడు. రాఘవు లీ విషయంలో మహా ఘటికుడు అవను దొరికినప్పుడల్లా అర్థ రూపాయి కెసరుపెట్టేవాడు. ఆ వూళ్ళో ఒక్కటే సినిమాహాలు. తెలుగు సినిమాలే వస్తుంటాయి. ఒక్కొక్కటి నెలపైన ఆడుతుంది. వాడెళ్ళేటి టికెట్టు పావలా! యిష్టముంటే ఇంకెవ రింటోనో నౌకరీ కున్నవాణ్ణి ఒకణ్ణి వెంటపెట్టుకుని పోయేవాడు. లేకపోతే, పావలా టికెట్టుకొని, మూడు కాసులకు షోడాత్రాగి, అణా కిల్లీవేసుకుని

సినిమాకు వెళ్ళేవాడు. రెండోఆట సగమయ్యే సరికి నిద్రవస్తే అణాన్నర పెట్టి టీ త్రాగేవాడు.

"శివయ్యగారు మారాజు, ఆ రాఘవులుకు నెలకు రెండుసార్లు సినిమాల కిస్తారు బీడీలకు రోజు కణా యిస్తారు. కనకమ్మగారు రోజూ కూరేసి పెడ్తారు" అని ఇతర్ల యిళ్ళల్లో పాలేర్లు సాధించే వాళ్ళ యజమానులను. "కొడుకులు బస్తీలకెళ్ళి సంపాదించుకు తింటుంటే, తీరి కూర్చుని ముసలాడు పాలేళ్ళను పాడుచేస్తున్నాడు" అనుకునేవారు ఆ వూళ్ళో మిగతా ఆసాములు. ఆడవాళ్ళు మాత్రం "మరీ విరగబడి పోతున్నారు పోదూ" అనో "వృత్త తట్ట తగలేసుకునే రకాలు" అనో నిందించి అక్కసు తీర్చుకునేవారు.

రాఘవులకు శివయ్యన్నా, కనకమ్మన్నా చాల గౌరవం. కనకమ్మ సిసలైన రైతు భార్య అడుగడుక్కీ రాఘవుల్ని "చిన్నావును బొత్తిగా పిండేశావేం? కోడెదూడకు బాగా విడిచిపెట్ట మంటినిగా" అనో ....కుడితంతా తొట్టిలోనే వుంది గేదెలేం తాగినయ్" అనో, "ఎడ్లకు దానాలో వుప్పు వేశావా లేదా" అనో, వంగపాదులకు నీళ్ళెట్లా మర్చిపోయావురా" అనో వెనక దగుల్తూనే వుండేది. అటువంటప్పుడు; ఏనెలకొకసారి తప్ప, ఎప్పుడూ పత్రిక చదువుతూ కూర్చోవటమేగాని పని సంగతి పట్టించుకోని శివయ్యను తల్చుకుని "అయ్యగారు మహారాజు!" అనుకునేవాడు. "చాలండీ అమ్మగారూ" అని తాను అంటున్నా, "మేమిద్దరమేనా, ఏం చెయ్యను. మజ్జిగ కుడితిలో కలపనా?" అని గిన్నెడు పెరుగు రాఘవులకు వంచేస్తే "అమ్మగారు మాతల్లి!" అనుకునేవాడు.

కనకమ్మ స్వతహాగా ఒంటరితనం గిట్టని మనిషి. కొడుకు లిద్దరికి చదువు లబ్బాయని, నిజంగా ఆమె ఎప్పుడో పిల్లలు చిన్నతనంలో తప్ప ఆ తర్వాతెప్పుడు సంతోషించలేదు. 'చదువు లంటబట్టీ వుద్యోగాలంటూ వూరువిడిచి వెళ్ళిపోయారు' అనుకునేది. పోనీ కొడుకుల దగ్గరకే వెళ్దామనుకుంటే, ముసలాయన వూళ్ళో లేకపోతే పొలం పుట్రా చూసే దెవరు? పెద్ద కొడుకు బస్తీలో హైస్కూల్లో లెక్కలు మాస్టరు. చిన్న

కొడుకు ఎగ్రికల్చరల్ డిమాన్‌స్ట్రేటర్. పప్పులని, వుప్పులని మూటలు కట్టి తీసికెళ్ళమంటే పెద్ద కొడుకు "ఎందుకే యిక్కడిని సొమ్ము చేయ రాదా? అక్కడ మేం కొనుక్కోమా? బస్సులమీదా, రైళ్ళమీద ఎందు కొచ్చిన మోత?" అన్నాడు. "మన పొలంలో గింజలు అనే ప్రేమేలేదు వీడికి" అనుకుంది కనకమ్మ. ఆవకాయ, గోంగూర జాడీల్లో సద్ది చిన్న కొడుకును పట్టికెళ్ళమంటే "అక్కర్లేదమ్మా యీ ఏడాది నీ కోడలు పెట్టింది వూరగాయలన్నీ" అన్నాడు. తను ఆశ్చర్యపోయి "అప్పుడే అది వూరగాయలు పెట్టేంత అయిందిరా?" అన్నది. "అదేదో పత్రికల్లో చదివి పెట్టింది" అన్నాడు కొడుకు. 'అమ్మ చేతి ఆవకాయ' అనైనా ఆప్యాయతలేదు వీడికి అనుకుంది. కొడుకులిద్దరూ వెళ్ళిపోయాక ఎవరికి అక్కరలేకపోయిన పప్పు మూటలు, పచ్చడి జాడీలు చూసి కళ్ళనీళ్ళు తిరిగాయి కనకమ్మకు. శివయ్య మాత్రం నవ్వుతూ వాళ్ళ బాధ వాళ్ళు పడుతుంటే సంతోషించక నీకెందుకొచ్చిన తాపత్రయం?" అన్నాడు. కనకమ్మకు భర్తను మింగెయ్యాలన్నంతకోపం వచ్చింది. ఆ రాత్రి ఒక నిద్రతీసి లేచాకగాని భర్తని భోజనానికి పిలువలేదు.

ఆ వూళ్ళో తనతోటి వాళ్ళందరూ కోడళ్ళను తెచ్చుకుని తీరిక చేసుకుంటే, ఈ నాటికి తనకు ఈ లంకంత కొంపలో ఒంటరి చాకిరి తప్పలేదు. వయస్సులో వున్నపుడు భర్త అడుగులకు మడుగులొత్తిన కనకమ్మ వయస్సు మళ్ళాక, ఒంటరిగా వుండలేక చీటికిమాటికి భర్త మీద విసుక్కుని కాస్త శాంతి పొందేది.

ఆ రాత్రంతా కనకమ్మ రాఘవులి కోపాన్ని గురించే ఆలోచిం చింది. తెల్లవారుఝామున ఒక దివ్యమైన ఆలోచన తట్టింది కనకమ్మకు. "వీడికి తొందరగా పెళ్ళి చేయిస్తేసరి" అనుకుంది. కాపరాలు చేసుకునే కొడుకులున్న కనకమ్మకు ఆపాటి ఆలోచన రాకపోదు! ఆ మర్నాడు రాఘవులి తల్లి కొడుకుని చూసిపోదామని వచ్చింది. దానితో తనకు తోచిన ఆలోచనను కదిపింది కనకమ్మ. "నేనూ చూస్తానేవున్నానమ్మ గారూ! మొన్న పెద్ద పండక్కి యింటికొచ్చినపుడు మా ప్రక్కవూళ్ళో

ఒక పిల్లను చూసి వచ్చాడు. బుద్ధి తక్కువదాన్ని నేనే పంపాను. ఇప్పు డంటాడు గదా "ఆ పిల్ల నాకు నచ్చింది, దాన్నే చెయ్యమని" వాళ్ళేమో యాభై రూపాయలు ఓలి అడిగారు. మనకెందుకు చెప్పండి అటువంట ప్పుడు, ఇవతల పాతికరూపాయలకు పిల్లలు దొరుకుతుంటే- మీరుకూడా కాస్త గట్టిగా చెప్పండమ్మగారూ!" అన్నది రాఘవులి తల్లి. కనకమ్మ నిజంగా సంతోషించింది. "ఈ సన్నాసి ఒక్కసారీ నాతో అనలేదేం?" అని నవ్వి, లోపలికెళ్ళి పెట్టెతీసి చీరమడతల్లోంచి పాతికరూపాయలు పట్టుకొచ్చి రాఘవులి తల్లికిచ్చింది. "పాతిక వున్నాయన్నావుగా, ఇవి కలిపి వాడికిష్టమైన పిల్లనే ఖాయం చేయి" అని చెప్పి ఒక పెద్ద సమస్య తీర్చినట్లు తృప్తిపడింది కనకమ్మ.

రాఘవులూ ఒక యింటివాడయ్యాడు. ఆ తర్వాత ఇంకో సమస్య వచ్చిపడింది. "నిన్ననే వస్తానన్నాడు. ఇంతవరకూ అజలేదు. వాడి కల వాటుపడిన గేదెలు ఇంకెవరికీ పాలియ్యవు" రాఘవులిమీద విసుక్కుం టుంది కనకమ్మ.

"సంబరంగా చేయించావే పెళ్ళి, ఇప్పుడు నెలకు రెండుసార్లు వెళ్తున్నాడు వూరికి! బాగా అయిందిలే నీకు!" అన్నాడు శివయ్య.

"నాకు బాగా అవటమేమిటి? మన ఆవులకోసం, గేదెలకోసం వాడు పెళ్ళి మానుకుంటాడటండీ!" అన్నది కనకమ్మ.

"మరయితే విసుక్కుంటావు దేనికి?" అన్నాడు శివయ్య.

"ఆవగింజంత ఆలోచనైనా మీకు తట్టదని!"

"అదేమిటి నన్నేం చెయ్యమంటావ్?" అన్నాడు శివయ్య.

"మన దక్షిణపువేపు దొడ్డి ఖాళీగానే వుందామె. ఒక గుడిసె వేయిస్తే సరి. చీటికి మాటికి వాడు వూరు పరుగెత్తడు" అంది కనకమ్మ.

శివయ్యకు తన చిన్నతనం గుర్తుకొచ్చి చిన్నగా నవ్వుకున్నాడు. "సరే దానికేం వేయిద్దాం; వచ్చాక వాడితో చెప్పు" అన్నాడు.

సీతను తీసికొచ్చి రాఘవులు గుడిసెలో కాపురం పెట్టాడు. కన కమ్మకు కొంత ఒంటరితనం తీరింది. తర్వాతెప్పుడైనా శివయ్య రాఘ

వుల్ని తిడితే, వాడు ఆ కోపం సీతమీద తీర్చుకునేవాడు. తన కోడెదూడ లకు గండం తప్పిందని సంతోషించినా, సీత కోపానికి గిన్నెలూ, చెంబులూ సొట్టలు పడిపోతుంటే కనకమ్మకు మళ్ళీ దిగులు పుట్టింది.

కనకమ్మ అదృష్టం మంచిదే. ఆ దిగులు మరి రెండేళ్ళకు తీరింది.

ఆనాడు ప్రొద్దున్నే రాఘవులికి బాగా చివాట్లు తగిలాయి. వాడు గింజుకుంటూ గుడిశెలోకి వెళ్ళి సీతమీద అరిచాడు. అది రుంజుకుంటూ వచ్చి చెంగులు దోపుకుని అంట్లగిన్నెల ముందు కూలబడింది. ఇంతలో రాఘవులి రెండేళ్ళ కొడుకు రాముడు "అమ్మా! కాని యివ్వవే!" అంటూ తల్లి చీర పట్టుకులాగాడు గోముగా. సీత మసి చేత్తోనే ఒక్కటి చరిచింది వాడి వీపుమీద. వాడు గుక్కపట్టి ఏడ్చాడు కాసేపు. ఇంతలో అక్కడికి ఒక కుక్క వచ్చి నిలిచింది నేలవాసన చూసుకుంటూ. ఏడుస్తున్న రాముడు ఒకరాయి విసిరాడు కుక్కమీదకు. దెబ్బతగిలిన కుక్క అరుచు కుంటూ పోయింది. రాముడు ఏడుపు మానేశాడు. వసారాలో కూర్చుని ఆకుకూర ఏరుకుంటున్న కనకమ్మకు జరిగిందంతా కంటబడ్డది. రాఘవులి కొడుకుని దగ్గరకు పిలిచి కాని యిచ్చింది. కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళి పోయాడు రాముడు. కానీతో కోడెదూడలకు, కంచుగిన్నెలకు గండం తప్పినందుకు తృప్తిగా నవ్వుకుంది కనకమ్మ.

—o—